క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు .ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పీజీతో పాటు పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్-1 ఖాళీ ఉందని తెలిపారు. మరింత సమాచారం కోసం 9000049142,8978684962 నంబర్లలో సంప్రదించాలన్నారు.

22 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సోమ, మంగళవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 22 మంది పట్టుబడగా వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 20 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

'చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి'

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి అన్నారు.బుధవారం అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని భానూర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ... గత 16 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు తమ న్యాయమైన కోరికలను తీర్చాలని ప్రభుత్వానికి విన్నవించినా వినకపోవడం వల్లనే సమ్మెకు వెళ్ళడం జరిగిందన్నారు. నాగులపల్లి, సందు గూడెం, వెలిమెల అంగన్‌వాడీ సెంటర్లు తెరవాలని బలవంతంగా తాళాలు పగలగొట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'మనూ'ను సందర్శించిన కెనడియన్ ప్రొఫెసర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంను కెనడియన్ స్కాలర్ ప్రొఫెసర్ కరెన్ ర ఫిల్ బుధవారం సందర్శించారు. కెనడాలోని టోరంటో విశ్వవిద్యాలయం, అంటారియోలోని హిస్టారికల్ స్టడీస్ విభాగం, మతపరమైన అధ్యయన విభాగం ప్రొఫెసర్ కరెన్ రఫిల్ మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మనూ ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ గౌరవ ప్రొఫెసర్ అజీజుద్దీన్ పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

గచ్చిబౌలి: విద్యార్థులు సంవత్సరం పాటు ఉచితంగా బస్సు ప్రయాణం చేసే విధంగా బస్‌పాస్‌లను రఘునాథ్ ఫౌండేషన్ కో చైర్మన్ సాయిరాం యాదవ్ అందజేశారు. బుధవారం కొత్తగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి తన జన్మదిన వేడుకలు చేసుకున్నారు. అనంతరం 250 మంది విద్యార్థులకు పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములుగౌడ్, భరత్‌యాదవ్, కుమార్ సాగర్, కిరణ్, వెంకట్ రెడ్డి, రాజేష్ యాదవ్, చరణ్‌రెడ్డి, పవన్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హఫీజ్‌పేట్ : చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన ప్రకారం.. గోపన్‌పల్లి తండా చెరువులో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం ఉందని చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. పచ్చ రంగు బనియన్, నీలిరంగు ప్యాంటు ఒంటిపై ఉందని మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందన్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రోడ్లపైనే మురుగు

వరదలా పారుతున్నా పట్టించుకోరా...?





రాయదుర్గం: లక్షలాది రూపాయలు వెచ్చించినా డ్రైనేజీ సమస్య పరిష్కారమవడం లేదు. గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్, శ్యామ్‌నగర్ ప్రాంతాలలో పలుచోట్ల నిత్యం రోడ్లపైకి మురుగు పారడంతో స్థానికులు ఇక్కట్ల పాలవుతున్నారు. రూ.26 లక్షలతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిత్యం మురుగులోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించినప్పుడు శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని స్థానికులు పేర్కొంటున్నారు.







అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



భెల్ ఎంఐజీ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ గాంధీ, కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: అభివృద్ధిలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. భెల్ ఎంఐజీ కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి మంగళవారం రాత్రి శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఇందిరాగాంధీ మహిళా మండలి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఎంఐజీ కాలనీలో 15 రోజుల్లో నీటి ప్రెషర్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జి.మోహన్‌గౌడ్, నాగమణి, మహిళా మండలి అధ్యక్షురాలు జ్యోతి, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ ముదిరాజ్, సంపత్ గౌడ్, కుమార్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాధకృష్ణ, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

నిత్య పూజలు..

శేరిలింగంపల్లి జోన్‌బృందం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలో గణేష్ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు గణేశుడిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాలు ముగియనుండడంతో నిమజ్జనాలకు సిద్ధమవుతున్నారు.



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో పూజలందుకున్న వినాయకుడు



మియాపూర్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, స్థానిక నాయకులు, ఉత్సవ సమితి ప్రతినిధులు



ఎన్టీఆర్‌కాలనీలో..కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్ తదితరులు



గోపన్‌పల్లిలో..కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్, ఉత్సవ సమితి ప్రతినిధులు

శాకంబరేశ్వరుడిగా గణనాథుడు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ దేవాలయంలో నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం గణేష్‌గడ్డ దేవస్థానంలో గణనాథుని ప్రత్యేకంగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఆవరణలో నిత్యాన్నదానం కొనసాగుతున్నట్లు ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు.



కులరహిత సమాజమే సోమనాథుడి లక్ష్యం

హెచ్‌సీయూ తెలుగు ఆచార్యులు రాములు



మాట్లాడుతున్న రాములు, తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: కుల రహిత సమాజమే పాల్కురికి సోమనాథుడి లక్ష్యమని హెచ్‌సీయూ తెలుగు ఆచార్యులు పిల్లలమర్రి రాములు పేర్కొన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆన్‌లైన్ సమావేశంలో గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు విభాగం ద్వారా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్కురి సోమనాథుడు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారనీ, ఆయన శివారాధన చేసే స్వర్ణకారుల కులానికి చెందిన వారని పరిశోధకులు వేల్చేరు నారాయణరావు అన్నారని వివరించారు. పాల్కురి సోమనాథుడే స్వయంగా తనకు కులం లేదన్నాడనీ, పార్వతీ పరమేశ్వరులే తన తల్లిదండ్రులని ఆయన వీరశైవ సాంప్రదాయంను అనుసరించడంతో బాటు కులరహిత సమాజం కోసం కృషి చేశాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్యులు పమ్మి పవన్ కుమార్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం రీసెర్చ్ ఫెలోలు డాక్టర్ కె రమేష్, డాక్టర్ కె రవి, డాక్టర్ ఈతకోటా ఈశ్వర రావు, నూనావత్ రాంబాబు, గౌరీశ్వరరావు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు.. 1816 మంది ఎంపిక



మూడోవిడత ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డబుల్ బెడ్‌రూం మూడోవిడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 1816 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. మొదటి, రెండో విడతలో 1000 మందిని ఎంపిక చేశారని, మొత్తం 2,816 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 2, 5వ తేదీన ఇళ్ల కేటాయింపు ఉంటుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని, ఇళ్లు ఎక్కువగా కేటాయించాలని మంత్రులకు విన్నవించగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.

నల్లగండ్ల- గోపన్‌పల్లి సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

శేరిలింగంపల్లి: నల్లగండ్ల- గోపన్‌పల్లి ప్రధాన రోడ్డులో కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను మంగళవారం రాత్రి స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. సెంట్రల్ లైటింగ్‌తో ఐటీ ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, శ్రీనివాస్‌యాదవ్, చెన్నంరాజు, జంగయ్యయాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రాలు సందేశాత్మకం





మాదాపూర్: చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో కళాకారుడు అగాచార్య వేసిన చిత్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. చిత్రాలు సమాజంలో మార్పు తెచ్చే విధంగా ఉండాలన్నారు. ఈ ప్రదర్శన అక్టోబర్ 1వ తేదీ వరకు ఉ.10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా సాయిరామ్ యాదవ్ జన్మదిన వేడుకలు



సాయిరామ్ యాదవ్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ తదితరులు



గచ్చిబౌలి: మా ప్రతి అడుగు ప్రజల కోసమే, ప్రతి నిమిషం ప్రజాసేవకే అంకితమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శిరీష హోమ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మారబోయిన సాయిరామ్ యాదవ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీ హిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తామని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో సాయిరామ్ యాదవ్ రాణిస్తున్నారని అభినందించారు. అనంతరం పార్టీ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్యకర్తలు, స్నేహితులకు కేక్ పంపిణీ చేశారు.

మైహోం భూజ గణపతి లడ్డూ రూ.25,50,000 లక్షలు



గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో గణపతి లడ్డూల వేలం పోటాపోటీగా జరుగుతోంది. నాలెడ్జ్ సిటీలోని మైహోం భూజలో గణపతి లడ్డూ రూ.25,50,000 పలికింది. ఫ్లాట్ నెంబర్ 1802లో నివాసం ఉండే ఉన్నతి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ ఈదులకంటి చిరంజీవిలడ్డూను రూ.25,50,000 లక్షలకు సొంతం చేసుకున్నారు. చిరంజీవిగౌడ్ ఆయన సతీమణి సునీతకు నిర్వాహకులు లడ్డూ అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు- మనబడి ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. చిట్కుల్- లక్డారం గ్రామాలను అనుసంధానిస్తూ నిర్మించిన బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్లు, వైద్యం, విద్యా తదితర రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతగా ఎంపిక చేసిన 55 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా , జెడ్పీటీసీ సుప్రజ ,మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం యాదవ్, మాధవి నరేందర్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంఈఓ రాథోడ్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేం



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో..



కొండాపూర్ బెటాలియన్‌లో నివాళులర్పించిన సిబ్బంది

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి ఉపకమిషనర్ వంశీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించామన్నారు. సూపరింటెండెంట్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: తెలంగాణ ఉద్యమంలో పోరాట పటిమను చాటిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడని కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ కొనియాడారు. బుధవారం కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు దేవిదాస్ రాథోడ్, నరసింహస్వామి, సత్యనారాయణ, నారాయణ దాసు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ , జెడ్పీటీసీ సుప్రజ, కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్ప నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, పద్మశాలి సంఘం చైర్మన్ రాజమల్లయ్య, అధ్యక్షులు వేముల రమేష్, ప్రతినిధులు రఘు రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.